www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 28 జనవరి 2024
5
కాకినాడ

ఉద్యోగ వ్యతిరేక విధానాలపై మౌనం సరికాదు

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక విధనాలను అమలు చేస్తుంటే కొన్ని ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు మౌనం వహించడం సరికాదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఐక్య వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డిఎఆర్.రాజ్ శనివారం ఓ ప్రకటనలో అన్నారు. నానాటికి నైతికత, విలువలతో కూడిన పోరాటాలు కనుమరుగయ్యే దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన ఉద్యమాన్ని చూసైనా ఉద్యోగ సంఘాల, అసోసియేషన్ల నాయకత్వాలు కళ్లు తెరవాలన్నారు. అంగన్‌వాడీల ఉద్యమ స్ఫూర్తితోనైనా ఉద్యోగ సంఘాలు నేతలు సిపిఎస్ రద్దు కోసం పెద్దఎత్తున ఉద్యమించాలని కోరారు.

పరిహారం కోసం ఎదురుచూపులు

వడ్డీలు చెల్లించలేక రైతన్నల కష్టాలు

ప్రజాశక్తి - కోటనందూరు

మిచౌంగ్ తుపాన్‌తో నష్టపోయిన రైతన్నలు ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం ఎదురుచూపులు చూడక తప్పడం లేదు. తుపాను ప్రభావంతో నమోదు అయిన అధిక వర్షాలతో చేతికొచ్చిన పంట నీటి పాలు అయ్యింది. మండలంలోని 15 పంచాయతీల పరిధిలో 825 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. మీచాంగ తుఫానుతో కురిసిన అధిక వర్షాల వల్ల కొంత నేలకొరిగి, మరికొంత నీటమునిగి పంట నాశనం అయ్యింది. మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 1601 మంది రైతులకు సంబధించిన 825 హెక్టార్లలో వరి పంటకు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. పంట నష్టం రూ.1.40 కోట్లు వరకూ ఉంటుందని అంచనా వేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. మండలంలోని కెఇ చిన్నయ్యపాలెం, కోటనందూరు, జగన్నాధపురం గ్రామాల్లో అత్యధికంగా పంట నష్టం జరిగింది. ఒక్కో ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ రైతన్నలు పెట్టుబడి పెట్టారు. అయితే పంట చేతికి వచ్చే దశలో తుపాన్ రైతులను నిండాముంచింది. తుపాను వీడిని వారం రోజుల తరువాత ప్రభుత్వం స్పందించి నష్టం అంచనాను వేసేందుకు యంత్రాంగాన్ని రంగంలోకి దించింది. ఎట్టకేలకు అధికారులు పంట నష్టంను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలను అందించారు. అయితే ఈ తతంగం జరిగి రెండు నెలలు కావస్తుంది. అయితే ప్రభుత్వం రైతన్నలకు ఇస్తామన్నా పంట నష్టం రూ.6,500లను నేటికీ అందించిన పరిస్థితి లేదు. వడ్డీపై అప్పులు తెచ్చి పంటను సాగు చేశామని, తుపాన్ తమ బతుకులను నాశనం చేసిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజులు గడుస్తున్న కొలదీ తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని, వడ్డీ వ్యాపారుల ఒత్తిడి రోజు రోజుకీ పెరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతన్నలకు ఇచ్చే నష్ట పరిహారాన్ని త్వరితగతిన అందించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నీట మునిగిన వరి పంటతో దిగాలుగా రైతన్న (ఫైల్ ఫొటో)

పరిహారం ఇచ్చి ఆదుకోవాలి

ఖరీఫ్‌లో 2 ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. నాట్లు వేసే దశలో వర్షాలు లేకపోవడంతో ఇంజన్ల ద్వారా నీటిని తోడి పంటను కాపాడుకున్నాను. పంట చేతికి వచ్చిన దశలో తుపాను ప్రభావంతో కురిసిన అధిక వర్షం పంటను ముంచేసింది. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాను. ప్రభుత్వం ఇచ్చే పంట నష్టం పరిహారాన్ని త్వరితగతిన అందించాలని కోరుతున్నాను.

-ఎల్.సత్తిబాబు, రైతు, కెఇ చిన్న పాలెం గ్రామం

కుటుంబ పోషణ కష్టంగా మారింది

తనకున్న ఎకరన్నర పొలంలో ఖరీఫ్‌లో వరి పంటను సాగుచేశాను. ఆర్థిక ఇబ్బందుల రీత్యా అప్పులు చేసి మరీ సాగును చేపట్టాను. రేపోమాపో కోత కోసి పంటను ఇంటికి తెచ్చుకుందామని అనుకుంటున్న దశలో తుపాన్ తనకు కన్నీటిని మిగిల్చింది. మొత్తం పంట నీట మునిగి నాశనం అయ్యింది. పెరిగిన నిత్యవసర ధరలతో కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. పరిహారం ఇచ్చి తమను ఆదుకోవాలి.

–ఎం.సత్తిబాబు, రైతు, కొత్త కొట్టం గ్రామం.

కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంఘీభావ బైక్ ర్యాలీ

కార్మిక, రైతు సంఘాల సంఘీభావ బైక్ ర్యాలీ

-ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్‌కు సంఘీభావంగా ఆల్ ఇండియా కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక భానుగుడి సెంటర్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రాజబాబు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు గదుల సాయిబాబు, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వింజమళ్ల చిట్టిబాబు మాట్లాడారు. అధిక ధరలతో సామాన్యులు పేదరికంలో నెట్టబడుతుంటే, మోడీ మిత్రులు అదాని, అంబానీలు మాత్రం ప్రపంచ కుబేరుల స్థానానికి పోటీ పడుతున్నారని, ఆక్స్ ఫార్మ్ నివేదిక ప్రకారం జిఎస్‌టి భారం సమన్యులపైనే పడిందని, జిఎస్‌టి పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో అట్టడుగు ప్రజల నుంచి 64 శాతం అంటే రూ.15 లక్షల కోట్లు ముక్కుపిండి వసూలుచేస్తున్నారని, 10 శాతంగా ఉన్న ధనవంతులైన కార్పొరేట్ల నుంచి 3 శాతం జిఎస్‌టి మాత్రమే వసూలు చేస్తూ కార్పొరేట్లకు మోడీ ప్రభుత్వం ఊడిగం చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టులను భర్తీ చేయకుండా కేంద్రం తాత్సారం చేస్తుందన్నారు. ఈ పదేళ్ల కాలంలో 1 లక్షా 50 వేల మంది రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాక ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకాన్ని నీరుగారుస్తూ బేడ్జెట్‌లో 33 శాతం కోత విధించిందని విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రయివేటికరిస్తున్నా, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం చెల్లించే బాధ్యత నుంచి మోడీ ప్రభుత్వం తప్పుకుంటుంటే అధికార వైసిపి ప్రభుత్వం 5 ఏళ్లలో ఒక్క మాట మాట్లాడకుండా మోడీ భజన చేస్తూ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఓడించేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి 16న జరుగుతున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయడం ద్వారా మోడీ ప్రభుత్వానికి హెచ్చరికను ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారెడ్డి, రైతులు కెవివి సత్యన్నారాయణ, కాళ్ళ నాగేశ్వరరావు, ఓరుగంటి శివ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరబండి చంద్రవతి, టిడిపి రైతు విభాగం నాయకులు వెంకటరమణ, ధర్మారావు, ఎఐఎఫ్‌టియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి అంజిబాబు, ఐఎన్‌టియుసి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కార్యనిర్వాహక కార్యదర్శి తాళ్లూరి రాజు, పిడిఎస్‌యు కార్యదర్శి వి.మయూరి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేసవరపు అప్పలరాజు, పప్పు ఆదినారాయణ, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన కైట్ గ్రూపు విద్యార్థులకు చైర్మన్ పోతుల వెంకట విశ్వం ప్రత్యేక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కైట్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సుమారు 50 మంది విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.రామకృష్ణ, డి.రేవతి, డైరెక్టర్ ఐశ్వర్య, రామ్ కిరణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ విశ్వం

ఆయిల్‌పామ్ సాగు ద్వారా లాభాలు

ప్రజాశక్తి - శంఖవరం

ఆయిల్ ఫామ్ సాగు ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని పతంజలి ఫుడ్స్ ప్రయివేటు లిమిటెడ్ మేనేజర్ బొడ్డు వెంకటరమణ అన్నారు. ఆయిల్ ఫామ్ రైతులకు శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరైనా ఆయిల్ ఫామ్ మొక్కలను సాగు చేయడం ద్వారా ఎకరాకి రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకూ లాభం వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న వెంకటరమణ

యుటిఎఫ్ నేత జానకి రాముడు మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

యుటిఎఫ్ నేత, విశ్రాంత ఉపాధ్యాయులు బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బిఎస్ఐ) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పూర్వపు అధ్యక్షులు కాశి జానకి రాముడు (85) శనివారం మృతి చెందారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు కరుణ, స్వర్ణలత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కొడుకు జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. ఆయన మృతి పట్ల ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, మండలం యుటిఎఫ్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. బిఎస్ఐ నాయకులు గుత్తాల శ్రీరాములు, యడ్ల కుటుంబరావు, విశ్వజన కళామండలి రాష్ట్ర నాయకులు వడ్డి ఏడుకొండలు, ఎండిడబ్ల్యూఏ అధ్యక్ష, కార్యదర్శులు పెయ్యల రమేష్, తాడి షణ్ముఖ రాజు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు అత్తిలి బాబూరావు తదితరులు సంతాపం తెలిపారు.

ఆలయానికి రూ.3.02 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.1,70,700, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,25,706, కేశఖండన ద్వారా రూ.6,430 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పులి.నారాయణమూర్తి తెలిపారు.చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ సొమ్మును దోచుకుంటున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజల కష్టార్జితమైన కార్పొరేషన్ సొమ్మును వక్ర మార్గాల్లో ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి దోచుకుంటున్నారని మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక దుమ్ములపేట సమీప ప్రాంతంలోని సర్వే నెంబర్. 1986/3డి2, 1989/1ఎ, 4ఎ గల 4 ఎకరాల 67 సెంట్ల ప్రయివేటు స్థలాలకు కాకినాడ నగరపాలక సంస్థ నుంచి గజం రూ.28 వేలు చొప్పున 1:4గా సుమారు రూ.251 కోట్ల విలువ చేసే టిడిఆర్ బాండ్లను మంజూరు చేయించి ఎంఎల్‌ఎ దోచుకున్నారని విమర్శించారు. ఇదే ప్రాంతాన్ని ఆనుకుని కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో అనేక ప్రభుత్వ భూములు, పోర్టు భూములు ఉన్నాయని, ద్వారంపూడి తనకి లబ్ధి చేకూరేలా ప్రయివేట్ భూములను ఎంపిక చేసి వాటికి గుట్టు చప్పుడు కాకుండా టిడిఆర్ బాండ్లు మంజూరి చేయిం చాడని, వక్రమార్గాల్లో కార్పొరేషన్ సొమ్మును దోచుకుం టున్న ద్వారంపూడికి సహకరించలేక గత కమిషనర్లు బదిలీలపై వెళ్లిపోవడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత కమిషనర్ నాగ నరసింహారావు ద్వారంపూడి దోపిడికి సహకరిస్తూ కార్పొరేషన్ సొమ్ములను దుర్వినియోగం చేస్తూ కార్పొరేషన్ ఖజానాను గుల్ల చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఈ విధంగానే కార్పొరేషన్ పరిధిలో గల సురేష్ నగర్ ప్రభుత్వ భూములపై ప్రయివేట్ వ్యక్తులకు టిడిఆర్ బాండ్లు మంజూరు చేసి కార్పొరేషన్ సొమ్మును దుర్వినియోగం చేశారని ఆరోపిం చారు. కార్పొరేషన్ సొమ్ము దుర్వి నియోగంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి మంజూరు చేసిన టిడిఆర్ బాండ్లను రద్దు చేసి ప్రభుత్వ ఖజానాను కాపాడాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని కొండబాబు తెలి పారు. ఈ సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు మల్లి పూడి వీరు, పలివెల రవి, తుమ్మల రమేష్, గదుల సాయిబాబా, సీకోటి అప్పలకొండ, ఒమ్మి బాలాజీ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

స్వామినాయుడు మృతికి సంతాపం

నివాళులర్పిస్తున్న దొరబాబు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ మామ స్వామి నాయుడు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. వైసిపి నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి తండ్రి స్వామినాయుడు(86) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. స్వామి నాయుడు గతంలో ఒక ప్రముఖ దినపత్రికకు ఏజెంట్‌గా దశాబ్దాల కాలం పని చేశారు. ఆయన కుమారుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి సతీమణి అరుణ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. స్వామి నాయుడు మృతి చెందారన్నా సమాచారాన్ని తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, వైసిసి ట్రేడ్ యూనియన్ నాయకుడు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్రా దేవి సంతాపం వ్యక్తం చేశారు.

ఉజ్వల గ్యాస్ సిలిండర్ల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

పిఎం ఉజ్వల పథకం ద్వారా 58 మంది లబ్ధిదారులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను సర్పంచ్ అరుణ సువాసిని దేవి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నున్న శంకర నారాయణ, మాజీ సర్పంచ్ రెడ్డి బాబు, సచివాలయం కార్యదర్శి వేణుగోపాల్, చిట్టూరి చలపతి, నందికోళ్ళ శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలెండర్‌ను అందిస్తున్న సర్పంచ్ అరుణ సుహాసిని దేవి

జల్లు స్నాన ఘట్టం ఏర్పాటు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని గొంచాల గ్రామం స్మశాన వాటికలో గ్రామానికి చెందిన జిల్లా పంచాయతీ రాజ్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అమజాల దొరబాబు తన తల్లిదండ్రులు దివంగత అమజాల లక్ష్మణ రావు, రామామణి దంపతుల జ్ఞాప కార్థం రూ.2 లక్షలతో జల్లు స్నానఘట్టంను ఏర్పాటు చేశారు. నూతన జల్లు స్నాన ఘట్టంను శనివారం సాయంత్రం దొరబాబు కుటుంబ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మశాన వాటికలో అంత్యక్రియలకు హాజరయ్యి తిరిగి వెళ్లే వారు స్నానాలు చేసేందుకు వీలుగా ఈ జల్లు స్నానఘట్టంను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుని కలిసిన డాక్టర్ కాద

ప్రజాశక్తి - కాకినాడ

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును రామచంద్రాపురం టిడిపి నాయకుడు, సత్య స్కాన్, డయాగ్నోస్టిక్స్ గ్రూప్ అధినేత డాక్టర్ కాద వెంకటరమణ మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం కలిశారు. తనకు రామచంద్రాపురం శాసనసభ సీటును కేటాయించాలని డాక్టర్ కాద వెంకటరమణ అభ్యర్థనను అందచేశారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు అన్ని స్థాయిలలోని నాయకులతో కలిసి సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారని వెంకటరమణ తెలిపారు. ఇటీవల కాలంలో మండపేటలో జరిగిన టిడిపి పిలుస్తోంది రా కదిలిరా కార్యక్రమంలో చంద్రబాబు సమక్షంలో టిడిపి కండువాను కాదా వెంకటరమణ వేసుకున్న విషయం విధితమే.

ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - కరప

ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎంఎల్‌ఎ విఫలం అయ్యారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పంతం నానాజీ విమర్శించారు. మండలంలోని యండమూరు గ్రామంలో జనసేన నాయకులు గంజా దుర్గా ప్రసాద్, కుక్కల మల్లేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి జనసేన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, స్థానిక ప్రజలు గ్రామంలో నెలకున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో రహదారులు అధ్వానంగా మారాయని, వడ్డిపాలెం నుంచి వేళంగా వెళ్లి ఏటిగట్టు రోడ్డుకి శంకుస్థాపన చేసి వదిలిపెట్టేశారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన నిధులను వాకాడ గ్రామానికి మళ్లించి తమ గ్రామంలో పనులను నిలిపివేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా పథకాల పేరుతో ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారాన్ని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపికి చెందిన నాయకులు పిల్లి శ్రీను, పిల్లి రమేష్, గుబ్బల అప్పారావు, మేడిశెట్టి భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి సమావేశం ఫిబ్రవరి 3కి వాయిదా

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల జడ్‌పి సాధారణ సర్వ సభ్య సమావేశం ఫిబ్రవరి 3కి వాయిదా పడింది. ఈ నెల 30న జరగాల్సిన సర్వసభ్య సమావేశంలో అనివార్య కారణాలవల్ల వాయిదా పడినట్లు జడ్‌పి సిఇఒ ఎ.రమాణరెడ్డి తెలిపారు.

కార్టూ'నిజం'

ముగిసిన నాటిక పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ పోటీలో గుంటూరు అభినయ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'ఇంద్రప్రస్థం' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. న్యాయనిర్ణేతలు కె.శాంతారావు, గోగులపాటి సీతారామస్వామి, రాధాస్వామిలు పోటీ ఫలితాలను ప్రకటించారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ నాటక ప్రదర్శనలు విజయవంతం అయ్యాయంటే అందుకు నటీనటుల కృషి మాత్రమే కారణం కాదని, ఈ నాటిక పోటీలను చూడడానికి వచ్చిన ప్రేక్షకులు ప్రధాన కారణమన్నారు. నాటక రంగానికి ప్రోత్సాహం తగ్గుతున్న ఈ రోజుల్లో గ్రామీణ ప్రాంతంలో ఈ పరిషత్తు పోటీలు విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ పోటీల్లో మిత్ర ఆర్ట్స్ హైదరాబాద్ వారు ప్రదర్శించిన 'లక్ష్మణ రేఖ' దాటితే ద్వితీయ ప్రదర్శనగా ఎంపికైంది. చైతన్య కళా భారతి ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం' తృతీయ ప్రదర్శనగా నిలిచింది. జ్యూరీ ప్రదర్శనగా కళాంజలి ప్రగతి నగర్ ప్రదర్శించిన 'రైతే రాజు' నిలిచింది. ఉత్తమ నటుడిగా లక్ష్మణ రేఖ దాటితే నాటికలో విశ్వనాథ పాత్రధారి ఎస్ ఎం భాషా, ద్వితీయ ఉత్తమ నటుడిగా స్వప్నం రాల్చిన అమృతం నాటికలో కృష్ణప్రసాద్ ఎంపికయ్యారు. ఉత్తమ నటిగా 'కెరటాలు' నాటికలో శాంతి ఎంపిక కాగా, ఉత్తమ రచనగా రైతే రాజు నాటిక రచయిత కంచర్ల సూర్య ప్రకాష్, ఇంద్రప్రస్థం దర్శకుడు ఎస్.రవీంద్రారెడ్డి ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. ప్రతీ విభాగంలోనూ జ్యూరీ బహుమతిలను అందజేశారు. విజేతలు అందరికీ బహుమతి ప్రధానం చేశారు.

ఉత్తమ ప్రదర్శన బహుమతిని అందుకుంటున్న కళాకారులు

ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతిని అందుకుంటున్న కళాకారులు

నేరాలు ఘోరాలు

ఘటనా స్థలంలో దంపతుల మృతదేహాలు

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రోళ్లపాలెం నేషనల్ హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. గాదాలపాటి వెంకట్రావు, గారపాటి మంగతాయారు భార్యాభర్తలు. వారు శనివారం అమలాపురం వైపు నుంచి బోడసకుర్రు వైపునకు బైకుపై వెళ్తున్నారు. వారు రోళ్లపాలెం వద్దకు వచ్చే సరికి ఎదురుగా మినీ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట్రావు(55), మంగతాయారు(50) అక్కడిక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని అమలాపురం పట్టణ ఎస్ఐ క్రిస్టోఫర్, రూరల్ ఎస్ఐ వీరబాబు, అల్లవరం ఎస్ఐ హరీష్ కుమార్ పరిశీలించారు. ఘటనకు కారణమైన వ్యాన్ డ్రైవర్పై కేసు నమోదు చేశారని డిఎస్పి అంబికా ప్రసాద్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కాకినాడ నుంచి తిరుమలకు వెళుతున్న తిరుమల ఎక్స్ప్రెస్ రైలు ఎక్కుతూ జారిపడిన సంఘటనలో వ్యక్తి గాయాలపాలయ్యాడు. స్థానిక రైల్వేస్టేషన్లో శనివారం రైలు కదిలే సమయంలో ఎక్కుతూ ఒక్కసారిగా జారిపడి కిందపడిపోయాడు. దీంతో ఆ ప్రయాణికుడికి గాయాలయ్యాయి. దీంతో రైల్వే పోలీసులు ఆ క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయాలపాలైన వ్యక్తి వివరాలు తెలియాల్సివుంది.

సారా కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని తాళ్లూరు, బొర్రంపాలెం గ్రామాల శివారుల్లో ఉన్న సారా బట్టీలపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో సారా బట్టీ నిర్వాహకులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ లక్ష్మణరావు వెల్లడించారు. తాళ్లూరు గ్రామ శివారులో సారా బట్టీపై దాడి అయినవిల్లి సత్యనారాయణను అరెస్టు చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు, 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే బొర్రంపాలెం గ్రామానికి చెందిన పిడిమి దుర్గా ప్రసాద్ తాళ్లూరు గ్రామ శివారులో నిర్వహిస్తున్న సారా బట్టీపై దాడి చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 800 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామిని దర్శించుకునేందుకు నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కుని పరారయ్యారు. పిఠాపురం మండలం విరవ గ్రామానికి చెందిన మహిళ కాలినడకన తన గ్రామం నుంచి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయానికి బయలుదేరి వస్తుండగా దివిలి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో బంగారు గొలుసు, పుస్తెల తాడు తెంపేందుకు ప్రయత్నించారు. దీంతో ఆ మహిళ కేకలతో చుట్టుపక్కల వారు రావడంతో అప్పటికే తగిపోయిన బంగారు గొలుసు తీసుకుని పారిపోయారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా పోలీస్ స్టేషన్లో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని తెలిపారు.

గోదావరి కాలువలోకి దూసుకెళ్లిన కారు

కారును ఢీకొన్న స్కూల్ బస్సు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కాకినాడ రోడ్లో రైల్వేగేటు సమీపంలో శనివారం సాయంత్రం ఆదిత్య కళాశాలకు చెందిన బస్సు కారును ఢీకొట్టింది. దీంతో కారు గోదావరి కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలావున్నాయి..శనివారం సాయంత్రం పెద్దాపురంలో విధులు ముగించుకుని మారుతి కారులో ఆర్డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాస్ కాకినాడ బయలుదేరారు. స్థానిక రైల్వే గేట్ దాటాక వెనక నుంచి ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన బస్సు బలంగా ఢీ కొట్టింది. దీంతో కారు కుడివైపు ఉన్న గోదావరి కాలంలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న డిఇ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంతో ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు కాలువలో పడిన కారును క్రేన్ సహాయంతో తొలగించి ట్రాఫిక్ రాకపోకలను క్రమ బద్దీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

చెట్టును ఢీకొన్న కారు

ప్రజాశక్తి - యానాం

దొమ్మేటి పేట సమీపంలో కొండమూరి భాస్కరరావు గార్డెన్ వద్ద అదుపుతప్పి ఒక కారు చెట్టును ఢీకొట్టింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలావున్నాయి. యానాంకు చెందిన డిపర్తి నారాయణస్వామి, పూడి కిరణ్ ఇద్దరూ యానాం నుంచి పొలానికి వెళ్తుండగా శనివారం భాస్కరరావు గార్డెన్ వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి రెండు పల్టీలు కొట్టింది. అయితే కారులో ఉన్న ఇద్దరు తేరుకుని బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలోనే డీజిల్ ట్యాంకుకు రంధ్రం పడి కారులోంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ స్టేషన్కు సమాచారం అందించారు. తర్వాత అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన ఇద్దరికి స్వల్ప గాయాలపాలయ్యారు. కారుడ నుంచి బయటపడిన తరువాత ఒక వ్యక్తి స్పృహ కోల్పోవడంతో ఇద్దరిని కాకినాడ జిజిహెచ్కు తరలించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు ధృవీకరించారు. ఈ ప్రమాదంపై ట్రాఫిక్ ఎస్ఐ వీరభద్రస్వామి కేసు నమోదు చేశారు.

స్ఫూర్తినీయం...అంగన్వాడీల పోరాటం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అంగన్వాడీ ఉద్యోగులు తమ ఉద్యమ పథంలో మరో మైలురాయిని దాటారు. అంగన్వాడీల సమ్మె నేపథ్యంలో 'చలో విజయవాడ'కు పిలుపునిచ్చిన విషయం విధితమే. విజయవాడకు బయలు దేరిన అంగన్వాడీలను ప్రభుత్వం నిర్బంధానికి గురి చేసింది. జిల్లా వ్యాప్తంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల్లో అక్రమ అరెస్టులకు పాల్పడి సుమారు 12 గంటల పాటు నిర్బంధించింది. అక్కడితో ఆగకుండా టెర్మినేషన్ లెటర్లు తీసుకోవాలంటూ బెదిరింపులకు సైతం పాల్పడింది. అయినా అంగన్వాడీలు వెనక్కి తగ్గలేదు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామంటూ తేల్చి చెప్పి భవిష్యత్తు పోరాటలకు స్ఫూర్తిగా నిలిచారు. ఎట్టకేలకు ప్రభత్వమే దిగొచ్చి పలు డిమాండ్లను పరిష్కరించడంతో పాటు వేతనాల పెంపునకు గడువు కోరింది. నిర్దేశిత కాలంలోపు హామీలు అమలు చేయని పక్షంలో మరోసారి సమ్మె తప్పదంటూ అంగన్వాడీలు హెచ్చరించారు. ఇది తాత్కాలిక విరామమే అంటూ తేల్చి చెప్పారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు యథావిధిగా విధుల్లో చేరి సేవలందిస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయ సంఘాలు సిపిఎస్ రద్దు కోరుతూ మరో పోరాటానికి సిద్ధం అయ్యాయి. గతంలో నిర్వహించిన ఆందోళనలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం విధితమే. ఇప్పుడు మరో రాష్ట్ర వ్యాప్త పోరాటానికి సిద్ధపడ్డారు. దీనికి రాజమహేంద్రవరం వేదిక కానుంది. నేడు జరిగే సభలో భవిష్యత్తు కార్యచరణను ప్రకటించేందుకు అవి సమాయత్తం అయ్యాయి. ప్రభుత్వం పునరాలోచించుకుని పాత పెన్షన్ స్కీమును అమల్లోకి తీసుకురాకుంటే తీసుకోవాల్సిన కార్యాచరణకు నేడు బీజం పడనుంది.

టిడిపి, జనసేన కూటమిలో ముసలం

టిడిపి, జనసేన కూటమిలో ముసలం పుట్టింది. మూడు నెలల క్రితం ఇదే జిల్లాలో జనసేన అధినేత పవన్కళ్యాన్ పొత్తు ప్రకటించిన విషయం విధితమే. అయితే తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ పొత్తుకు జిల్లాలోనే తెరపడనుందా అనే సందేహాలు ఆ రెండుపార్టీల్లోనూ వ్యక్తమవుతున్నాయి. టిడిపి అధినేత చంద్రబాబు అరకు, మండపేట నియోజక వర్గాల నుంచి టిడిపి పోటీ అంటూ చేసిన ప్రకటనపై జనసేన అధినేత భగ్గుమన్నారు. తామేమి తక్కువ కాదంటూ రాజానగరం, రాజోలులో జనసేన పోటీ చేస్తుందని ప్రకటించారు. చంద్రబాబు పొత్తు ధర్మం పాటించలేదని ఘాటుగా విమర్శించారు. ఈ నేపథ్యంలో రాజానగరంలో తెలుగు తమ్ముళ్ల తిరుగుబావుటా ఎగురవేశారు. జనసేనకు సహకరించేది లేదని పత్రికా ముఖంగా తేల్చిచెప్పడంతో పాటు పార్టీ అధ్యక్షులకు వినతిపత్రం అందించడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఉందని 2014 ఫలితాలు, 2024లో పునరావృతం కావడం ఖాయమని తేదేపా నేతల్లో ధీమా వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలతో పొత్తుపై నీలినీడలు కమ్మాయనే విమర్శలు విన్పిస్తున్నాయి.

'తూర్పు'పై స్పెషల్ ఫోకస్

టిడిపి నేతలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో స్పెషల్ ఫోకస్ పెట్టారని ఆ పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. అధినేత చంద్రబాబు నాయుడు మండపేటలో నిర్వహించిన సభలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాలని కోరడంతో పాటు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 7 అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు ఎంపీ సీటు గెలవటం ఖాయమని జోస్యం చెప్పారు. అయారాం. ఇదే సందర్భంగా మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాలంటూ అభ్యర్థిని ఖరారు చేసినట్లు చెప్పకనే చెప్పారు. తూర్పులో తొలి సీటు ఖాయం అవడంతో వేగుళ్ల శిబిరంలో నూతనోత్సాహం నెలకొంది. ఇదే సభలో అధికార పార్టీ నేతలకు పేరు పేరునా హెచ్చరికలు చేయడం చర్చనీయాంశమైంది. మరోవైపు చంద్రబాబు సతీమణి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3 రోజుల పాటు పర్యటించి పార్టీ శ్రేణులతో మమేకం అయ్యారు. స్కిల్ స్కాం కేసులో చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో నిజం గెలవాలి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విధితమే. మనోవేదనతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించేదుకు మూడు జిల్లాల్లో పలు కుటుంబాలను కలిశారు. పార్టీ శ్రేణులతో మమేకమై జిల్లా తేదేపాలో ఉత్సాహన్ని నింపారని తెలుస్తోంది.

ఓటర్ల జాబితాపై వెల్లువెత్తిన విమర్శలు

జిల్లా అధికార యంత్రాంగం విడుదల చేసిన ఓటర్ల జాబితా తప్పుల తడకలుగా మారటంతో ఓటర్లలో అసహనం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కార్యాలయానికి క్యూ కడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 16.50 ల క్షల ఓటర్లు ఉన్నారని అధికార యంత్రాంగం లెక్కతేల్చింది. ఆ మేరకు గత వారంలో జాబితాను విడుదల చేసింది. తాజా జాబితాలో తప్పులను వీలైనంత త్వరగా సరిచేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

గోదారి గలగలలు

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

ఎన్నికల సమయం ఆసన్నమైందని, అందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని ఎంపి వంగా గీత అన్నారు. శనివారం స్థానిక సురక్ష కళ్యాణ మండపంలో 4వ విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు వైద్యం పొందేలా ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని తెలిపారు. మహిళలంతా ముందుండాలని సిఎం జగన్ మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పింఛన్లు వాలంటీర్ ద్వారా ఇంటికే అందిస్తున్నారని తెలిపారు. మహిళలంతా గ్రూపులుగా ఏర్పడి వచ్చే ఎన్నికల్లో ఎవరిని ఎన్నుకోవాలన్నది మీరే నిర్ణయించుకోవాలని తెలిపారు. జనం గౌరవింగా ఉండాలను ప్రజలంతా బాగుండాలను జగన్ ప్రభుత్వం రావాలని గీత తెలిపారు. గత ప్రభుత్వ పనితీరు ప్రభుత్వ పనితీరు చూసి ప్రతి ఒక్కరు ఓటు వేయాలని కోరారు. ఎంఎల్ఎ పెండెం దొరబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా గడపగడపకు కార్యక్రమం నాలుగున్నర ఏళ్ళ తిరిగామని చెప్పారు. పదవులు ఉన్న లేకున్నా మీకు అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారే సుధా, వైస్ ఎంపిపిలు మాధురి, చెట్లు బత్తిన సురేష్ కుమార్, సర్పంచులు ఉమ్మడి మేరీ జాన్, పాలెం దొరబాబు, వైసిపి నాయకులు రావు చిన్నారావు, కారే శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకున్న పిఎంపి వైద్యులు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రంగంపల్లి నగర్ కాలనీలో ఇటీవల కాలంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు పిఎంపి వైద్యులు సాయం అందించారు. బాధిత కుటుంబాలకు 75 కేజీల బియ్యాన్ని పంపిణీ చేసి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ బాషా, గౌరవ అధ్యక్షులు టిఎన్.మూర్తి, కార్యదర్శి జగతా బాబ్జీ, కోశాధికారి ఎ.రమణ, కొండ్రోతు కృష్ణ, కె రాంబాబు, ఎస్కె.వలీషా, డి.సుబ్బారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం ప్యాకెట్లు అందిస్తున్న పిఎంపిలు

వైసిపికి అండగా నిలవండి

ప్రజాశక్తి - రౌతులపూడి

రాబోయే ఎన్నికల్లో వైసిపికి అండగా నిలవాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి ఇన్ఛార్జ్ వరుపుల సుబ్బారావు కోరారు. మండలంలోని ములగపూడి, గంగవరం, దిగివసివాడ, రాజవరం, ఎం.కొత్తూరు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు వైసిపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. అనంతరం బలరామపురం గ్రామానికి చెందిన అచ్చర్తి సాంబమూర్తిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో శంఖవరం ఎంపిపి పర్వత రాజుబాబు, జడ్పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, అన్నవరం దేవస్థానం ట్రస్ట్బోర్డు సభ్యులు వాసిరెడ్డి జమీలు, సర్పంచులు సైపరెడ్డి వెంకటరమణ, దేవుడు బాబు, మండల పరిషత్ కో ఆప్షన్ నెంబర్ సత్యనారాయణ, నాయకులు పంచడా అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా పనిచేస్తేనే తగిన గుర్తింపు

ప్రజాశక్తి - గండేపల్లి

విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులు సక్రమంగా నిర్వహిస్తే తగిన గుర్తింపు లభిస్తుందని ఎంపిపి చలగల దొరబాబు, జడ్పిటిసి పరిమి బాబు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.వెంకట్ నరేష్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా ఆయనను వారు అభినందించారు. అలాగే సిహెచ్ఒ ఎన్విఎస్బిఆర్.శర్మ ఉత్తమ సేవ పురస్కారం అందుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అందరి సమిష్టి కృషితోనే ఉత్తమ సేవ పురస్కారం వచ్చిందని, రాబోయే కాలంలోనూ తమ సేవలను అందిస్తామని అన్నారు.

అవార్డును అందుకుంటున్న డాక్టర్ నరేష్

2వ రోజుకు దూసర్లపూడి దీక్ష

ప్రజాశక్తి - కాకినాడ

సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు నిరసనగా చేపట్టిన నిరాహార దీక్ష శనివారం నాటికి 2వ రోజుకు చేరింది. ఈ దీక్షా శిబిరాన్ని పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రమణ రాజు మాట్లాడుతూ ధర్నాచౌక్ అభ్యంతరాలపై అఖిల పక్షంతో కలెక్టర్ చర్చించి కలెక్టరేట్ వద్ద ప్రజా సమస్యలపై నిరసన తెలియచేసేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తన దీక్షను కొనసాగిస్తానని అన్నారు. ఆయన దీక్షకు మద్దతు తెలిపిన వారిలో సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్ల రాజశేఖర్, సిపిఐ రాష్ట్ర నాయకుడు తాటిపాక మధు, పిసిసి కార్యదర్శి ఆకుల వెంకటరమణ, ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ నరాల శివ, రాష్ట్ర అధికార ప్రతినిధి కార్యాచరి కృష్ణమోహన్, టిడిపి నాయకులు గదుల సాయిబాబు, మాజీ కార్పొరేటర్ పలివెల రవి, జనసేన నాయకులు ఎస్కె.వలీషా, సర్వీస్ సంఘం అధ్యక్షులు పోలుబత్తిన శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు చింతలపల్లి మధు కుమార్, ఏపి పౌరహక్కుల సంఘం నేత తమ్మర్తి సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు గంగా సూరిబాబు, దడాల సుబ్బారావు, ఇసుకపల్లి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

దీక్షకు మద్దతు ఇస్తున్న రాజకీయ పార్టీల నాయకులు

ఎన్నికలకు క్షేత్రస్థాయి కమిటీలు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - తాళ్ళరేవు

రానున్న సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్ర స్థాయిలో ఉన్న కమిటీలు సన్నద్ధం కావాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్ఛార్జులకు నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి మ్యానిఫెస్టోకి సంబంధించిన భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్ళి బాండులు ఇచ్చే ప్రక్రియ ఈ నెలాఖరులోగా పూర్తి చేయలన్నారు. కొత్త ఓటర్ జాబితాలో పలువురు జీవించి ఉన్న వారి ఓటర్ల తొలగింపు జరిగిందని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పార్టీకి నివేదిక ఇవ్వాలని కోరారు. ఈ శిక్షణలో బోళ్ళ రాజేష్, బత్తుల గణపతి, బొమ్మి రామకృష్ణ ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉంగరాల బూరిబాబు, మందాల గంగసూర్యానారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, కట్ట త్రిమూర్తులు, మోపూరి వెంకటేశ్వరరావు, నడింపల్లి వినోద్, వాకపల్లి చిరంజీవి, కొప్పిశెట్టి చంటి పాల్గొన్నారు.

రైలు ప్రయాణల్లో నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ప్రయాణికులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ లోవరాజు

రైలు ప్రయాణాల్లో నిర్లక్ష్యం తగదని రైల్వే ఎస్ఐ బి.లోవరాజు సూచించారు. స్థానిక రైల్వే స్టేషన్ ప్లాటు ఫారం 3 ప్రయాణికులకు రైలు ప్రయాణల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్ పరిధిలో ఎటువంటి అనుమానిత వ్యక్తులు కనబడిన తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నిషేధిత వస్తువులు గంజాయి, మద్యంతో రైలులో ఎవరైనా తీసుకెళ్తుంటే ఆ సమాచారాన్ని పోలీసులకు చేరవేయాలన్నారు. బ్యాగులు, సెల్ఫోన్లను దొంగలించే వ్యక్తుల నటంల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నాఉ. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యానాం వార్తలు

మురళీమోహన్కు నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, కార్మికులు

కార్మిక నాయకుడు మురళీమోహన్కు నివాళి

ప్రజాశక్తి - యానాం

యానాం రీజెన్సీ సెరామిక్స్ ఫ్యాక్టరీ కార్మిక ఉద్యమ నాయకుడు మచ్చ మురళీమోహన్ 12వ వర్ధంతిని కార్మికులు శనివారం నిర్వహించారు. రీజెన్సీ ఫ్యాక్టరీ మెయిన్ గేట్ వద్ద మురళీమోహన్ సతీమణి దుర్గ చేతుల మీదుగా ఎర్ర జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రీజెన్సీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ విల్సన్, జాయింట్ సెక్రెటరీ అదబాల సాంబశివరావు, గుడే దుర్గాప్రసాద్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. రీజెన్సీని తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. మురళీమోహన్ ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మురళి,రామేశ్వరరావు ,వర్మ, శ్రీను ,నాగేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, సుబ్బారావు, సత్యనారాయణ పెద్ద ఎత్తున వర్కర్లు పాల్గొన్నారు.

చంద్రశేఖర్కు రీజెన్సీ ప్రతినిధుల నివాళి

ప్రజాశక్తి - యానాం

రీజెన్సీ సెరామిక్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ దివంగత కెసి.చంద్రశేఖర్కు రీజెన్సీ గ్రూప్ సంస్థల ప్రతినిధులు నివాలులర్పించారు. రీజెన్సీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో చంద్రశేఖర్ 12వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. చంద్రశేఖర్ చిత్రపటానికి రీజెన్సీ సిరామిక్స్ సిఇఒ కె.మోహన్రావు, పూర్వపు రీజెన్సీ ఉద్యోగి కాకరపర్తి వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రీజెన్సీ సంస్థకు, రీజెన్సీ విద్యాసంస్థలకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. పాఠశాల హెచ్ఎం టివిఎస్ఎస్వి.ప్రసాద్రావు మాట్లాడుతూ ఆయన ఎందరికో ఆదర్శనీయమని, దానధర్మాలు చేసేవాడని తెలిపారు. అనంతరం యానాం వృద్ధాశ్రమంలో ఉన్న చంద్రశేఖర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మార్తాండ ప్రసాద్, చింతా కొండలరావు, సిహెచ్ వీరభద్రరావు, విద్యార్ధినీ విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్కు నివాలులర్పిస్తున్న ప్రతినిధులు, విద్యార్థులు

ఆసరా ద్వారా రూ.102 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి - కాకినాడ

వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతలుగా నియోజకవర్గంలో 3754 స్వయం సహాయక సంఘాలకు రూ.102 కోట్ల లబ్ధి చేకూర్చామని ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్రెడ్డి తెలిపారు. స్థానిక సాంబమూర్తి నగర్, గొడారిగుంట, రెవెన్యూ కాలనీ ప్రాంతాల్లో ఆసరా నాల్గవ విడత సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ చేస్తామంటూ గత టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకపోవడంతో దగాపడ్డ డ్వాక్రా మహిళల కోసం ఆసరా పథకాన్ని ముఖ్యమంత్రి జగన్ తీసుకొచ్చారని తెలిపారు. ప్రతి మహిళ ఆర్థికంగా నిలదొక్కుకుని లక్షాధికారి కావాలన్నదే సీఎం అభిమతమన్నారు. నవరత్న పథకాల ద్వారా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సి కర్రి పద్మశ్రీ, కుడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైసిపి నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు, మెప్మా పిడి ప్రియంవద, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పశు పులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని జె.కొత్తూరు గ్రామానికి చెందిన రాయుడు విష్ణు అదృష్టమైనట్లు ఎఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం జె.కొత్తూరు గ్రామానికి చెందిన రాయుడు శ్రీను పెద్ద కుమారుడైన విష్ణు 10వ తరగతి చదువుకుని తన తండ్రితో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 24న ఉదయం 10 గంటల సమయంలో విష్ణు జగ్గంపేటలోని డిగ్రీ కాలేజీకి పరీక్ష ఉందని వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాకపోగా సెల్ఫోను స్విచ్ ఆఫ్ అయ్యింది. దీనిపై విష్ణు తండ్రి రాయుడు శ్రీను చుట్టుపక్కల మరియు బంధువుల ఇంటి వద్ద స్నేహితుల వద్ద వెతికిన ఎటువంటి ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగ కల్పనకు ఇంటర్వ్యూలు

కరప: వికాస సంస్థ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు, ఉచిత శిక్షణ ఉద్యోగ కల్పన కొరకు ఇంటర్వ్యూలను ఫిబ్రవరి 3 నుంచి 6 వరకూ నిర్వహిస్తున్నట్లు మండల పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కరప, పెద్దాపురప్పాడు, వేళంగి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూలను యువతీ యువకులు ఉపయోగించుకోవాలని, ఆసక్తి ఉన్న యువతీ యువకులు 3న కరప చిరంజీవి కళ్యాణమండపంలోనూ, 5న పెద్దాపురప్పాడు జడ్పి హైస్కూల్లోనూ, 6న వేలంగి జడ్పి హైస్కూల్లో జరిగే ఇంటర్వ్యూల్లో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని తెలిపారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఎలక్ట్రికల్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘం జెండాను అధ్యక్షుడు తాడిశెట్టి గంగ ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీగా మున్సిపల్ సెంటర్కు చేరుకుని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆర్బి కొత్తూరు రహదారిలో సంఘ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో పెద్దాపురం కార్మిక శాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడారు. కార్మికులందరూ ఐక్యంగా, ప్రజాస్వామ్యయుతంగా ముందుకు సాగాలన్నారు. ఎలక్ట్రికల్ బల్బును కనిపెట్టడంలో థామస్ ఆల్వా చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జెఎస్కె.శ్రీనివాస్, యూనియన్ నాయకులు బుడతా సుధాకర్, నాలం శ్రీనివాస్, లంక చంటి, కె.దుర్గాప్రసాద్, సిఐటియు నాయకులు గడిగట్ల సత్తిబాబు, శ్రీనివాస్, గూనూరి వెంకటరమణ, వడ్డి సత్యనారాయణ, ప్రజానాట్యమండలి కళాకారులు డి.సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి తాళం వేసిన సర్పంచ్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

గ్రామ సమస్యలను పట్టించుకోకుండా గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ శనివారం మండలంలోని వేట్లపాలెం పంచాయతీ కార్యాలయానికి సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ హోలీ శ్రీరామ్, ఇతర పాలకవర్గం సభ్యులు తాళం వేశారు. పంచాయతీలో ఉన్న సిబ్బందిని ఉద్యోగులను బయటకు పంపించి తాళం వేసి గేటు వద్ద నిరసన తెలిపారు. గ్రామంలో వీధిలైట్లు, తాగునీరు, పారిశుధ్య సమస్యలను సైతం కార్యదర్శి పట్టించుకోవడంలేదన్నారు.

తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్

మున్సిపల్ కమిషనర్గా పద్మావతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కమిషనర్గా కెవి.పద్మావతి నియమితులయ్యారు. ఇప్పటి వరకూ కమిషనర్గా విధులు నిర్వర్తించిన జె.సురేంద్ర గ్రేటర్ విశాఖపట్నం కార్పొరేషన్ సూపరింటెండెంట్గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిడదవోలు కమిషనర్గా విధులు నిర్వహిస్తున్న పద్మావతి బదిలీపై పెద్దాపురం కమిషనర్గా రానున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ **శ్రీ రాయుడు వెంకటరమణ తండ్రి:రాయుడు శ్రీరాములు** గార్కి బి.దొడ్డవరం గ్రామంలో గల **డాక్యుమెంట్ నెంబర్ 76/2024** దానపట్టా దస్తావేజు పొందియున్నారు. సదరు ఆస్తిని గృహ నిర్మాణం చేయుట కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచి నందు ఋణం తీసుకొనుచున్నారు. సదరు ఆస్తికి సంబంధించి లింకు డాక్యుమెంట్ ఒరిజినల్స్ రిజిస్టర్ దస్తావేజు నెంబర్ **76/2024 (తేది.09-01-2024)** ఈ రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్కు లింకు డాక్యుమెంట్గా ఉన్న **1030/1998 (తేది.12-11-1998)**ఈ డాక్యుమెంట్ జిరాక్స్ నిమిత్తం బి.దొడ్డవరం ఇంటి దగ్గర నుండి అమలాపురం వచ్చే దారిలో పడిపోవడం జరిగింది. వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అమలాపురం బ్రాంచి నుండి నా క్లయింట్ ఋణాన్ని వినియోగించుకుంటున్నారు. ఒరిజనల్ లింకు డాక్యుమెంట్ పోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా దానపట్టా దస్తావేజు **76/2024 (తేది: 09-01-2024)** దీనికి సంబంధించిన లింకు డాక్యుమెంట్ దానపట్టా దస్తావేజు **1030/1998** యొక్క ఒరిజనల్ డాక్యుమెంట్స్ సదరు బ్రాంచ్కు అవసరమైన అన్ని డాక్యుమెంట్స్తో పాటు డిపోజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్స్ కనుగొన్న లేదా దొరికిన వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు లేదా పైన తెలిపిన నా క్లయింట్ చిరునామాకు వాపస్ చేయగలరు. ఇంకనూ తెలియజేయునది ఏమనగా ఈ డాక్యుమెంట్స్ దొరికిన వారు ఎవరైన వీటిని వినియోగించిన ఎడల చట్ట విరుద్ధమగును మరియు వారిపై అవసరమైన చట్టమైన చర్యలు తీసుకోబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

ఎన్.రమేష్, అడ్వకేట్ & నోటరీ
అమలాపురం. సెల్: 8008027999

వేలం ప్రకటన

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 104/2013, O.S. 150/2010

Between:
Peddireddy Ramam ***...D.H.R***
AND
Illa Satyavathi and Othrs ***...J.D.R's***

యీ నెంబరు E.P.లో DHR, JDRsకి చెందిన షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలమునకు తీసుకొని వచ్చుచున్నాడు. సదరు వేలంలో పాల్గొని పాట పాడుకోదలచినవారు **ది.06-02-2024 ఉదయం 10:30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరయి **పై వేలంలో పాల్గొని షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలంలో పాట పాడుకోవచ్చును.** మిగతా వివరాలు కోసం శ్రీ కోర్టు వారి నజారత్ ఆఫీసు నందు అడిగి తెలుసుకొనవలెను.

వేలం తేది: 06-02-2024

SCHEDULE

East Godavari District, Amalapuram Sub-Registry, Amalapuram Mandal, Peruru Village, Chindadagaruvu Panchayat Zeroyiti Wet.

Item No-1: R.S. No. 526/1, Ac. 2-30 cents out of full Ac. 2-66 cents

Boundaries: EAST: Irrigation bodi. ***SOUTH:*** Land of Pappula Udaya Bhaskaram. ***WEST:*** Land of Kode Naga Sundaram and others. ***NORTH:*** Land of Mushini Krishna Rao.

***Item No-2:* R.S. No. 526/1 Ac. 0-36 cents of Coconut garden out of full Ac. 2-66 cents.**

Boundaries: EAST: Item No. 1. ***SOUTH:*** Land of Pappula Udaya Bhaskara Rao. ***WEST:*** Drainage Canal. ***NORTH:*** Land of Mushini Krishna Rao.

Item No-3: R.S. No. 526/4 Ac. 0.34 cents out of full Ac. 0-90 cents.

Boundaries: EAST: Irrigation Bodi. ***SOUTH:*** Item No. 1. ***WEST:*** Land of Nagabheri People. ***NORTH:*** Land belongs. to Konde Naga Sundaram and Others. Total Ac. 3-00 of land with all fruit bearing trees and all other easementary rights etc.,

D.H.R. Value: Rs. 4,00,000/-
J.D.R. Value: NIL
Amin Value: Rs. 1,20,00,000/-
SRO Market Value:
Wet land Rs. 26,00,000/- per Ac.
Dry land Rs. 23,00,000/- per Ac.

G.S.NAIDU, Advocate
Amalapuram, Amalapuram
25-01-2024. Cell: 94409 25462